క్లుప్తంగా

ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ ఆదర్శ పాఠశాలలో ఆరో తగరతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ దిల్షాద్ తెలిపారు. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా https://apms. apcfss. in/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పాఠశాలలోనే తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు ప్రవేశ పరీక్ష కోసం రూ. 150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75 చెల్లించాలన్నారు. మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు.

కేసీ కాల్వకు 81 క్యూసెక్కుల నీరు

గూడూరు: కర్నూలు ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు శనివారం 81 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.078 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

అనుగొండలో గడ్డివామి దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోడుమూరు రూరల్: మండలంలోని అనుగొండ గ్రామంలో శనివారం సాయంత్రం గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన కురువ లింగన్న పొలంలో గడ్డివామి వేసుకున్నాడు. ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. సమాచారం అందుకున్న కోడుమూరు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి వెళ్లి మంటలను అదుపు చేశారు. చుట్టు పక్కల గడ్డివాములకు మంటలు వ్యాపించకుండా నిరోధించారు. గడ్డివామి పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు లింగన్న వాపోయాడు.

రేపటి నుంచి ఒంటి పూట బడులు

గూడూరు రూరల్: విద్యాశాఖ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ నెల 18వ తేదీ నుంచి ఒంటి పూట బడులను నిర్వహించనున్నామని ఎంఈఓ సునీలమ్మ తెలిపారు. ఉదయం 7.45 గంటలకు పాఠశాలలు ప్రారంభమై మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలన్నారు. ఒంటి పూట బడుల నిర్వహణలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యం చూపితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కూలీలందరికీ పనులు


క్రిష్ణాపురంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ

కోడుమూరు రూరల్: గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే పనులు కల్పిస్తామని ఏపీఓ మోదీన్‌బాషా అన్నారు. శనివారం కోడుమూరు మండలం క్రిష్ణాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలంతా ఉదయాన్నే పనుల్లోకి వచ్చి త్వరగా చేసుకుని వెళ్లాలన్నారు. ప్రతి కూలీ వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకోవాలని, ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.272 వస్తుందన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

కల్లూరు: మండలంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలను శనివారం ఎంఈఓ-1 శ్రీనివాసులు పరిశీలించారు. కల్లూరు మండలంలో మొత్తం 18 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తునట్లు తెలిపారు. విద్యార్థులకు మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

పెళ్లి కానుక అందజేత

పాణ్యం: పాణ్యం ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి సీఐ నల్లప్ప చేతుల మీదుగా శనివారం నూతన వధూవరులకు పెళ్లి కానుక అందజేశారు. తమ తల్లిదండ్రులు పాలం పార్వతమ్మ, నారాయణరెడ్డి జ్ఞాపకార్థం కొన్నేళ్లుగా వధూవరులకు తాళిబొట్టు, కాలిమెట్టెలు, నూతన వస్త్రాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏటా 108 జంటలకు అందిస్తున్నామన్నారు. వివాహ పత్రిక తీసుకొస్తే పెళ్లి కానుక అందజేస్తామని తెలిపారు.

అన్నదాతకు అండగా అగ్రిల్యాబ్

- గూడూరులో రూ.55 లక్షలతో వైఎస్సార్ అగ్రిల్యాబ్
- కల్తీ విత్తనాలు, ఎరువుల బారిన పడకుండా ప్రభుత్వం చర్యలు
- ఉచితంగా విత్తనాలు, ఎరువుల నాణ్యతా పరీక్షలు
- ఇప్పటి వరకు 94 శ్యాంపుల్స్‌కు పరీక్షలు

గూడూరు: రైతులు కల్తీ విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఒక వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేసింది. కోడుమూరు నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు రూరల్ మండలాల్లోని రైతాంగం రక్షణ కోసం గూడూరులో రూ.55 లక్షలు వెచ్చించి ఈ ల్యాబ్‌ను నిర్మించింది. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కు చెందిన స్థలంలో గత ఏడాది ఏర్పాటు చేసింది. అగ్రి ల్యాబ్‌లో ఒక ఏఓ, ఇద్దరు ఏఈఓలను నియమించింది. విత్తనాలు, ఎరువుల కల్తీని గుర్తించేందుకు అవసరమైన టెస్టింగ్ మిషన్‌లు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ల్యాబ్‌లో రైతులు తీసుకెళ్లే శ్యాంపుల్స్‌కు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. లూజు విత్తనాలకు మాత్రం పరీక్షలు చేయరు. విత్తనాల్లో మొలక శాతం, తేమ శాతం, విత్తనం స్వచ్ఛతను ధ్రువీకరిస్తారు. ల్యాబ్ ఏర్పాటుతో రైతులు నకిలీలతో నష్టపోయే ప్రమాదం తప్పింది.

రైతులకు ఎంతో మేలు

రైతులు ప్రైవేట్ వ్యక్తులు, వ్యాపారుల వద్ద కొనుగోలు చేసిన వివిధ రకాల విత్తనాలు, ఎరువుల నాణ్యతను అగ్రిల్యాబ్‌లో పరీక్షించుకుంటున్నారు. అలాగే రైతులు తాము పండించిన పంటలోని విత్తనాల నాణ్యతను పరీక్షించుకుని తిరిగి విత్తుకుంటున్నారు. అనుమానం వచ్చిన ప్రతి రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులను పరీక్షించుకుని పంట సాగు చేసుకుంటున్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనం మొదలు పంట విక్రయాల వరకు రైతుకు దన్నుగా నిలుస్తోంది. సీజన్‌కు ముందుగానే పెట్టుబడి సాయం అందిస్తోంది. సబ్సిడీతో ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తోంది. రైతులకు కల్తీ విత్తనాలు, నకిలీ ఎరువుల బెడద తప్పించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఒక అగ్రిల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. ఫలితంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు, రసాయన ఎరువులు, పురుగు మందులు అందుతున్నాయి.

నాణ్యత పరీక్షలు

అగ్రిల్యాబ్‌లో విత్తనాల్లో మొలక శాతం, తేమ శాతం, భౌతిక స్వచ్ఛతలను పరీక్షించి 28 రోజుల్లో నివేదిక ఇస్తున్నారు. ఎరువుల్లో ఎన్‌పీకే కాంప్లెక్స్, ఎన్‌పీకే మిశ్రమం, సూక్ష్మ పోషకాల్లో తేమ శాతం, పోషకాల శాతం, కణ పరిణామాలను పరీక్షించి 14 రోజుల్లో నివేదికలు ఇస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల నుంచి తీసుకున్న విత్తనాలు, ఎరువులను అగ్రిల్యాబ్‌లలో ఉచితంగానే పరీక్షిస్తారు. గూడూరు ల్యాబ్‌లో ఇప్పటి వరకు 94 పరీక్షలు చేశారు.

పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు

పాడి రైతుల సంక్షేమం కోసం అగ్రి ల్యాబ్‌లో పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల కూడా ఏర్పాటు చేశారు. పశువులు ఏదైనా వ్యాధికి గురైతే వాటికి కారణాలను గుర్తించేందుకు ఈ ల్యాబ్‌లో పరీక్షలు చేస్తారు.


గూడూరులో ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్


విత్తన నాణ్యతను పరిశీలిస్తున్న ఏఈఓ

ఉచితంగా పరీక్షలు

వైఎస్సార్ అగ్రి ల్యాబ్‌లో రైతులు తీసుకొచ్చే శ్యాంపుల్స్‌కు ఉచితంగా పరీక్షలు చేస్తున్నాం. విత్తనాల్లో మొలక శాతం, తేమ శాతం, విత్తనం స్వచ్ఛతను ధ్రువీకరిస్తాం. కోడుమూరు నియోజకవర్గానికి సంబంధించి గూడులో ల్యాబ్ పనిచేస్తోంది. ఈ ల్యాబ్ ఏర్పాటుతో నకిలీల బెడద తగ్గింది. ఇప్పటి వరకు 94 పరీక్షలు చేశాం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. –ఏఓ విజయకుమార్ రెడ్డి

నష్టపోయే ప్రమాదం తప్పింది



గతంలో విత్తనాలు నాణ్యతతో లేకపోవడం వల్ల నష్టపోయాం. వైఎస్సార్ అగ్రి ల్యాబ్ ఏర్పాటుతో విత్తనాల నాణ్యత ప్రమాణాలను ధ్రువీకరించుకుంటున్నాం. ఈ ల్యాబ్ రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. రైతులు కల్తీ విత్తనాల బారిన పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది.
–గొల్ల ఎర్రమల, రైతు, గూడూరు

రైతులకు వరం



ప్రభుత్వం గూడూరులో అగ్రి ల్యాబ్ ఏర్పాటు చేయడం రైతులకు వరం. ఇక్కడ ఉచితంగా విత్తనాలు, ఎరువుల పరీక్షలు చేసుకుంటున్నాం. దాని ఫలితాల ఆధారంగా పంట సాగు చేసుకుంటున్నాం. రైతుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. –దాసరి కృష్ణ, రైతు

పకడ్బందీగా పది పరీక్షలు


ఇన్విజిలేటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ

సి.బెళగల్: మండలంలో సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ ఆదామ్‌బాషా అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై పబ్లిక్ పరీక్ష కేంద్రాల హెచ్‌ఎంలు, పరీక్షల నిర్వహణ అధికారులు, ఇన్విజిలేటర్లతో కలిసి డీఈఓ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పరీక్ష కేంద్రాల అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులకు అవసరమైన వసతులు, సౌకర్యాలను పూర్తి స్థాయిలో కల్పించాలని సూచించారు. అదే విధంగా ఇన్విజిలేటర్లు పరీక్షలను ఎలాంటి సమస్యలు, అవకతవకలు లేకుండా నిర్వహించాలని, నిర్వహణలో లోపాలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

గజవాహనంపై ఊరేగిన శ్రీరంగనాథుడు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో శ్రీ గోదా దేవి సమేత రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజు శనివారం స్వామివారికి గజవాహన సేవ నిర్వహించారు. తిరుమాడ వీధుల్లో స్వామి వారు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీమన్నారాయణాచార్య స్వామి యాజ్ఞికత్వంలో అర్చకులు రమేష్ భట్టర్, కిరణ్ భట్టర్ బృందం వైజ్ఞిక క్రతవు నిర్వహించారు. గజం ఐశ్వర్యానికి, వైభవానికి సంకేతంగా భావిస్తారని పీఠాధిపతులు అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పేర్కొన్నారు.

అండగా ఉంటాం.. ఆశీర్వదించండి

- వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంపీపీ మునెప్పను పరామర్శిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి, సతీష్

కర్నూలు (సిటీ): ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని.. మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఆ పార్టీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. శనివారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని దేవమడ గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వారు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని శివాలయంలో పూజలు చేసి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. అనంతరం గ్రామంలోని బస్టాండ్ వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల కాలంలో కరోనా మహమ్మారి వల్ల ఏడాదిన్నరకు పైగా ఇబ్బందులు ఎదురైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, నిర్దేశించుకున్న క్యాలెండర్‌లోని పథకాలను పక్కాగా అమలు చేశామన్నారు. సర్టిఫికెట్ కావాలంటే రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగే రోజులు పోయాయని, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలిపాలని కోరారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

దేవమడ గ్రామాభివృద్ధికి కృషి

దేవమడ గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల జరిగిన మేలును గుర్తు చేసుకోవాలన్నారు. నిత్యం ప్రజలను వేధింపులకు గురిచేసిన జన్మభూమి కమిటీలు కావాలా, తెల్లవారకముందే ఇంటికి వచ్చి పింఛన్, పథకాలను తీసుకొచ్చే ప్రభుత్వం కావాలో తేల్చుకోవాలన్నారు. స్థానికులు కొందరు గొందిపర్ల వద్ద తుంగభద్ర నదిపై కర్నూలు నగరం నుంచి బ్రిడ్జి వేయాలని ఎమ్మెల్యే అభ్యర్థిని కోరారు. తాను గెలిచిన తర్వాత తప్పకుండా చర్యలు తీసుకుంటామని సతీష్ హామీ ఇచ్చారు. అనంతరం గొందిపర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దొడ్డిపాడు, పూలతోట మజరా గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్న కుమార్, వైస్ ఎంపీపీ నెహమియా, పార్టీ మండల కన్వీనర్ మహబూబ్ బాషా, నాయకులు డి.వాసు, చిన్నలక్ష్మన్న, మహేశ్వరరెడ్డి, వంశీకృష్ణా రెడ్డి, పంచలింగాల వెంకటేశ్వరరెడ్డి, మోహన్ బాబు, సురేష్, సర్పంచ్ శ్రీనివాసులు, గోపాల్ పాల్గొన్నారు.

ఎంపీపీకి పరామర్శ

సి.బెళగల్: సి.బెళగల్ ఎంపీపీ బొంతల మునెప్ప అస్వస్థతకు గురికావడంతో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కోడుమూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ శనివారం ఆస్పత్రికి వెళ్లి ఎంపీపీని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కాగా ప్రస్తుతం ఎంపీపీ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు చిన్న కొండయ్య, నరసింహుడు, బాలరాజు ఉన్నారు.


చెక్కులను పంపిణీ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కల్లూరు: పాణ్యం నియోజకవర్గంలోని 33 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్)కింద మంజూరైన రూ. 42,80,000లను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.

బాధ్యతాయుతంగా పని చేయాలి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. పార్టీ పదవులు పొందిన వారందరూ బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సందేపోగు శివను నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని కలిసి శివ ఆయనకు కృతజ్ఞతలు తెలిపాడు. వైఎస్సార్‌సీపీ నాయకులు గోపినాథ్, సిరాజ్, హుస్సేన్ సాహెబ్, షేక్షావలి, మనోరాజ్, సుభాన్, షకీల్ ఉన్నారు.


ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న శివ

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ

పాణ్యం: అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ సాధ్యపడుతుందని నంద్యాల సైబర్ సెక్యూరిటీ సీఐ సీఎం రాకేష్ అన్నారు. శనివారం ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచికే ఉపయోగించాలని సూచించారు. నంద్యాల జిల్లాలో రోజుకు 100 సైబర్ కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు, తక్కువ ధరకు వస్తువులు పొందవచ్చు అన్న ప్రకటనలతో ఎక్కువగా మోసపోతున్నారని తెలిపారు. ఉత్తర ఈశాన్య భారతంలోని వ్యక్తులు ఎక్కువగా ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా మోసపోతున్నారన్నారు. ముఖ్యంగా మహిళలు సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల బాధితులు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఓడీ భాస్కరరావు, డాక్టర్ రంగస్వామి, అన్నపూర్ణ, సైబర్ సెక్యూరిటీ సిబ్బంది సుబ్బరాయుడు, ఈశ్వర్, నీరజ, రఘు పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కంపెనీ ప్రతినిధులు

12 మందికి ఉద్యోగాలు

సి.బెళగల్: యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వంశీమోహన్ అన్నారు. శనివారం పాఠశాలలో మాండలేజ్ (క్యాడ్బరీ) చాక్‌లేట్ కంపెనీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్మీడియెట్ విద్యార్హత కావడంతో పెద్ద ఎత్తున అభ్యర్థులు హాజరయ్యారు. సంస్థ ప్రతినిధులు క్రిష్ణచైతన్య, పీఎస్ రావు, సతీష్ ఇంటర్వ్యూలు నిర్వహించి 12 మందిని ఎంపిక చేశారు.

గ్రూప్–1 పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

కర్నూలు(సెంట్రల్): గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. గ్రూప్–1 పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆయన ఆదేశించారు.

ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలి...

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు మండలాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీఓలు, తహసీల్దార్లతో ఎన్నికల కోడ్ అమలుపై సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు.

కేసీలో గుర్తు తెలియని మృతదేహం

కర్నూలు (టౌన్) : కేవీఆర్ కళాశాల వద్ద కేసీ కెనాల్‌లో గుర్తు తెలియని శవం కనిపించింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి 30 ఏళ్ల వయస్సు ఉంటుందని రెండోపట్టణ పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు వెల్లడించారు.

రేపు కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని ఎస్.కొంతలపాడు గ్రామంలో సోమవారం అంతర్రాష్ట్ర పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు పగిడ్యాల రాజు తెలిపారు. యాగంటీశ్వరస్వామి తిరునాల సందర్భంగా నిర్వహిస్తున్న పోటీల్లో గెలుపొందిన తొలి ఐదు జట్లకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు అదే రోజు ఉదయం 8 గంటల్లోపు రూ.400 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9502177501, 9849290398 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

గూడూరులో కేంద్ర బలగాల కవాతు


కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

గూడూరు: మండలంలోని గూడూరు, చనుగొండ్ల, గుడిపాడు గ్రామాల్లో శనివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు భరోసా ఇచ్చేందుకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు.

ఏడుగురిపై చీటింగ్ కేసు నమోదు

కర్నూలు (టౌన్) : 67 సెంట్ల స్థలాన్ని అభివృద్ధి చేసి ఇస్తానని చెప్పి మోసం చేయడమే కాకుండా రూ.2 కోట్లు డిమాండ్ చేసిన ఏడుగురిపై రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. స్కందాన్షి ఇన్‌ఫ్రా ప్రాజెక్టుకు చెందిన స్థలాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించిన జి.శ్రీనివాసులు, జి.వెంకటేశ్వర్లుతో పాటు మరో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేద్దాం


పార్టీ నాయకులతో శివ నరసింహారెడ్డి

గడివేముల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేద్దామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తనయుడు కాటసాని శివ నరసింహారెడ్డి అన్నారు. శనివారం గడివేములలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలని పిలుపునిచ్చారు. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి, పోగుల చంద్రశేఖర్ రెడ్డి, దస్తగిరిరెడ్డి, దేశం నాగేశ్వర్‌రెడ్డి, శివానందరెడ్డి, ఎల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జయంతి

కోడుమూరు రూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం కోడుమూరులో ఘనంగా జరుపుకున్నారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి సర్పంచ్ భాగ్యరత్న పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక శ్రీవాసవీ కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు యుగంధర్ శెట్టి ఆధ్వర్యంలో సంఘం సభ్యులు కిరణ్, అశోక్, హరి, యుగంధర్, శ్రీకాంత్, గణేష్, నటరాజ్, వినోద్ తదితరులు శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల హర్షం

సి.బెళగల్: మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న రెగ్యులర్ ఉపాధ్యాయులను ప్రభుత్వం విద్యాశాఖలోకి విలీనం చేయడంపై సి.బెళగల్ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ప్రిన్సిపల్ వంశీమోహన్, ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయులుగా తమను గుర్తించి, 010 పద్దులో వేతనాలు చెల్లించాలన్న మోడల్ స్కూల్ టీచర్ల పదేళ్ల కోరికను నెరవేర్చిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని తెలిపారు. ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, కల్పలతకు ధన్యవాదాలు తెలిపారు.


మోడల్ స్కూల్‌లో స్వీట్లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపల్

పట్టుదలతోనే విజయం సొంతం


మాట్లాడుతున్న జయచంద్రాచారి

పాణ్యం: పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే విజయం సొంతం అవుతుందని గుంతకల్లు రైల్వే డివిజన్ సీనియర్ మేనేజర్ జయచంద్రాచారి అన్నారు. శనివారం నెరవాడ మెట్ట వద్దనున్న ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవాహ2024 సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యార్థుల్లో ఓపిక తగ్గుతోందని, పట్టుదల ఉంటేనే ఏదైనా సాధించగలమని అన్నారు. ఆలోచనలకు తోడు సంకల్ప బలం ఉంటే లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. సదస్సు కన్వీనర్ నాగభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ జయచంద్రప్రసాద్, డీన్ అశోక్ పాల్గొన్నారు.